ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల

జిల్లా వార్తలు

5★★

మంగళవారం 25 నవంబరు 2025

నటుడు ధర్మేంద్ర మృతి తీరనిలోటు

జగిత్యాల టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ హిందీ చలన చిత్ర నటుడు, పద్మభూషణ్ ధర్మేంద్ర మృతి జాతీయ కళ రంగానికి తీరని లోటు అని కళాశ్రీ ఈశ్వరమ్మ సాహిత్య పీఠం అధినేత గుండేటి రాజు అన్నారు. ధర్మేంద్ర మృతి పట్ల సంస్థ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. షోలే చిత్రంతో ప్రపంచ చిత్ర రంగానికి పరిచయమై షోలే చిత్రాన్ని ప్రపంచ పుటల్లో ఇప్పటికి చెరగని ముద్రవేసిన గొప్ప నటుడని సభ్యులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కవులు, కవయిత్రులు అయిత అనిత, మద్దెల సరోజన, లక్కరాజు, శ్రీలక్ష్మి, కటుకం కవిత, మద్దెల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడికి సన్మానం

జగిత్యాల టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): డీసీసీ అధ్యక్షుడు గాజేంగి నందయ్యను జిల్లా కేంద్రంలోని శ్రీ భక్త మార్కండేయ దేవాలయంలో పద్మశాలి సేవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సోమవారం నందయ్యతో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి శేష వస్త్రంతో సన్మానించారు. కార్యక్రమంలో పద్మశాలి సేవాసంఘం అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

వెల్గటూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజక్కపల్లి, శాఖాపూర్ గ్రామాలలో సోమవారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ బాధిత కుటుంబాలను పరామర్శించారు. రాజక్క పల్లిలో హెల్పర్ పత్తిపాక రవి, శాఖాపూర్‌లో సీనియర్ బీఆర్ఎస్ కార్యకర్త చిన్నక్క అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శించి మనో ధైర్యం నింపారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ పత్తిపాక వెంకటేష్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి జూపాక కుమార్, మూగల సత్యం, పెద్దూరి భరత్, నక్క సురేష్, కొప్పుల సురేష్, బాలుసాని రవి, సత్యం పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజన కార్మికులకు ఊరట

పెంపు ఇలా... (ఒక్కో విద్యార్థికి రూ.)		ఈ నెల	
తరగతి	పాత ధర	4న	17న
1 నుంచి 5	5.45	6.19	6.78
6 నుంచి 8	8.17	9.29	10.17
9 నుంచి 10	8.17	9.29	13.17

(వారానికి మూడు గుడ్లు కలిపి)

- ప్రభుత్వ పాఠశాలల్లో భోజన ధరల పెంపు
- నెల వ్యవధిలో రెండు సార్లు పెంపు నిర్ణయం
- తక్షణమే అమలు చేయాలని అధికారులకు ఆదేశాలు
- తీరనున్న వంట ఏజెన్సీ నిర్వాహకుల ఇక్కట్లు

జగిత్యాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చాలీ చాలని సొమ్ముతో వంట సరుకులను తెస్తూ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న కార్మికుల అవస్థలు కాస్త తీరనున్నాయి. సర్కారు బడుల్లో మధ్యాహ్న భోజనానికి సంబంధించి ప్రభుత్వం వంట ధరలు పెంచాలని నిర్ణయం తీసుకోగా విద్యాశాఖ అందుకు అనుగుణంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెలలో రెండుసార్లు ధరలు పెంచడం ఏజెన్సీ నిర్వాహకులకు మరింత ఊరటనిచ్చింది. పెంచిన ధరలను అమలు చేయాలని కలెక్టర్లు, విద్యా శాఖాధికారులకు సూచించారు. పెరిగిన ధరల ప్రకారం విద్యార్థులకు మరింత రుచికరమైన భోజనం అందించేందుకు అనుకూలంగా ఉంటుందని పలువురు వంట కార్మికులు అంటున్నారు. అయితే వీటిని గతేడాది డిసెంబరు నుంచి అమలు చేయాల్సి ఉండగా మే 1వ తేదీ నుంచి చేస్తుండడంతో అప్పటి నుంచి చెల్లించేందుకు సిద్ధమయ్యారు. ఒక్కో విద్యార్థికి అయ్యే ఖర్చు 60శాతం కేంద్రం భరించగా 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుంది. ఈ మేరకు నిత్యావసర సరుకుల ధరలు పెరిగి ఆహార నాణ్యత తగ్గుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ప్రకటన ఏజెన్సీలకు కొంత మేర కలిసి వచ్చింది.

జిల్లాలో 783 పాఠశాలల్లో పథకం

జిల్లాలోని 783 పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని అమలు చేస్తున్నారు. జిల్లాలో సుమారు 55 వేలకు పైగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందుతోంది. ఇందులో సుమారు 38 వేలు ప్రాథమిక, సుమారు 17 వేలు ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నట్లు విద్యాశాఖ రికార్డులు తెలుపుతున్నాయి. సుమారు 10 వేలకు పైగా పదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 1,566 మంది మధ్యాహ్న భోజన వంట కార్మికులు పని చేస్తున్నారు. కోడిగుడ్డు బిల్లు సపరేటుగా ఇస్తున్నారు. జిల్లాలో నెలకు సుమారు రూ.కోటి వరకు మధ్యాహ్న బిల్లులు అవుతుంటాయన్న అంచనా ఉంది.

పెరిగిన ధరలతో సతమతం..

ప్రభుత్వ పాఠశాలల్లోని ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మిగతా 8వ పేజీలో..

వేతనం అందించాలి..

సుతారి రాములు, వంట కార్మిక సంఘం నాయకుడు



ఏళ్ల తరబడి పోరాటం చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం చొరవ చూపాలి. నెలకు రూ.12 వేలు వేతనం చెల్లించి ఆర్థికంగా ఆదుకోవాలి. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి. బిల్లులు సకాలంలో అందించి గ్యాస్ సిలిండర్లను పూర్తిగా రాయితీపై పంపిణీ చేయాలి.

నాణ్యమైన భోజనం అందించాలి

రాము, జిల్లా విద్యాధికారి



ప్రభుత్వం మధ్యాహ్న భోజన ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. బిల్లులు సైతం రెగ్యులర్‌గా చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతీ పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి. ఎలాంటి ఇబ్బందులు లేకుండా హెచ్ఎం ఇన్‌చార్జీలు బాధ్యత తీసుకోవాలి.

మహిళల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

-విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



మేడిపల్లిలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న విప్ ఆది శ్రీనివాస్

మేడిపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మేడిపల్లి మండల కేంద్రంలో సోమవారం ఇందిరమ్మ చీరలను మహిళలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా శక్తి పథకం ద్వారా అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. 30 మంది లబ్ధిదాలరులకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం స్వశక్తి సంఘం బ్యాంకు లింకేజీ ద్వారా రూ.38 లక్షలు, 468 మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.40 కోట్ల 45 లక్షల రూపాయలు మంజూరు చేసి జిల్లాలో మండలం రెండవ స్థానంలో నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీవో అంజుమ, మార్కెట్ కమిటీ చైర్మన్ వినోద్, కాంగ్రెస్ నాయకులు ఏన్గు రమేష్‌రెడ్డి, నాగరాజు, దామోదర్, జలందర్, కొమురయ్య, యూసుఫ్, బలగం రాజేష్, లాజర్, సాల్మన్ పాల్గొన్నారు.

●**కథలాపూర్:** మహిళల ఆర్థిక స్వావలంబనతో రాష్ట్ర ప్రగతి సాధ్యమవుతుందని విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మహిళ స్వశక్తి భవనంను సందర్శించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు

-ఎస్పీ అశోక్‌కుమార్



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పోలీసు స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని పోలీస్ అధికారులను ఎస్పీ అశోక్ కుమార్ అదేశించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డే సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన ఆరుగురు ఫిర్యాదుదారులతో ఎస్పీ నేరుగా మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను చేరువ చేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని అన్నారు.

'ప్రభుత్వ ఉపాధ్యాయులకు టెట్ మినహాయించాలి'



సభ్యత్వం అందిస్తున్న యూటీఎఫ్ బాధ్యులు

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సర్వీస్‌లో ఉన్న సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలని, దీనిపై పార్లమెంట్‌లో చట్టం చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తిరుక్కోవెల శ్యాంసుందర్, అంబటి భూమేశ్వర్‌లు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపునివ్వాలని కోరుతూ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పిలుపుమేరకు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా, ఆయా మండలాల కమిటీల పక్షాన నవంబరు 25న ప్రధానమంత్రికి వినతిపత్రాలు, ఈ మెయిల్, పోస్టు ద్వారా తమ విజ్ఞప్తులను పంపనున్నట్లు తెలిపారు. నెలాఖరులోగా లోక్‌సభ, రాజ్యసభ సభ్యులను కలిసి వినతిపత్రాలు అందజేస్తామన్నారు. జిల్లాలో సంఘ పటిష్టతకు నిర్వహిస్తున్న సభ్యత్వ నమోదులో భాగంగా పలువురికి సభ్యత్వం అందజేశారు.

మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు

-వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ సత్యప్రసాద్, ఇతర అధికారులు

జగిత్యాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఈనెల 25వ తేదీన మహిళా సంఘాల సభ్యులకు వడ్డీలేని రుణాలు పంపిణీ చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి సీఎస్ రామకృష్ణారావు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కలతో కలిసి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు జగిత్యాల కలెక్టరేట్‌లో కలెక్టర్ సత్యప్రసాద్, ఇతర అధికారులు హాజరయ్యారు. ఇందిరమ్మ చీరల పంపిణీ, వడ్డీ లేని రుణాల పంపిణీపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజాగౌడ్, డీఆర్‌డీవో రఘువరన్, డీపీఆర్‌ఓ పల్లికొండ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నారాయణ

బీర్‌పూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని వాటి సాధనకు కృషి చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నారాయణ అన్నారు. సోమవారం బీర్‌పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాశాల అధ్యాపకుల సహకారంతో ప్రతి రోజు సాయంత్రం విద్యార్థులకు అల్పాహారం పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామకృష్ణ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

●రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



కొనుగోలు కేంద్రంలో ధాన్యం తేమను పరిశీలిస్తున్న మంత్రి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. ధర్మపురి మండలంలోని నేరెళ్ల గ్రామంలో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ ఆరుగాలం రైతులు కష్టించి పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుక వచ్చి మద్దత్తు ధర పొందాలని అన్నారు. వరి ధాన్యం ఏ గ్రేడ్ ధర రూ 2389, బీ గ్రేడ్ ధర రూ 2369 మద్దత్తు ధర ఉందని ఆయన తెలిపారు. రైతులు కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని ఎలాంటి కటింగ్ లేకుండా కొనుగోలు చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. కలెక్టర్, సివిల్ సప్లయ్ అధికారులు ఎప్పటికప్పుడు కొనుగోలు కేంద్రాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్, ధర్మపురి పీఏసీఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ఏఎంసీ ఛైర్‌పర్సన్ చిలుముల లావణ్య, తహసీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి రాజ్‌కుమార్, ధర్మపురి పీఏసీఎస్ సీఈవో అయ్యోరు రాజేష్, వైస్‌చైర్మన్ షేర్ల రాజేశం, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మంత్రి ప్రత్యేక పూజలు

ధర్మపురి క్షేత్ర సమీపంలో గల శ్రీ అక్కపెల్లి రాజ రాజేశ్వర స్వామి దేవాలయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి వెంట టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రాజేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్ పాల్గొన్నారు.

'బీసీలతో చెలగాటం ఆడుతున్న ప్రభుత్వాలు'

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలతో చెలగాటం ఆడుతున్నాయని బీసీ సంక్షేమ సంఘం బాధ్యులు చింతల గంగాధర్, బోగోజి ముఖేష్ ఖన్నా విమర్శించారు. జీవో నంబర్ 46ను వ్యతిరేకిస్తూ జిల్లా కేంద్రంలోని స్థానిక తహసీల్ చౌరస్తా వద్ద జీవోనం.46 ప్రతులను దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్‌లు మించకూడదనే సాకుతో ప్రభుత్వం ఈ జీవోను విడుదల చేయడాన్ని సంఘ పక్షాన తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందని ఆరోపించారు. ఈజీవో రాష్ట్రంలో బీసీల రాజకీయ ఎదుగుదలకు గొడ్డలిపెట్టుగా భావించక తప్పదన్నారు. జీవో 46ను రద్దుచేసి, జీవో 9కి చట్టబద్ధత కల్పించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల గంగాధర్, గాజుల నాగరాజు, జిల్లా కార్యదర్శి గుగ్గిల్ల సత్యనారాయణ, జిల్లా మహిళా అధ్యక్షురాలు గంగం జలజ, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు బోగోజి ముఖేష్ ఖన్నా, పెండెం గంగాధర్ ఉన్నారు.



జీవో నంబర్ 46 ప్రతులను దహనం చేస్తున్న బీసీ నాయకులు

'మత సామరస్యాన్ని పాటించాలి'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అందరూ మత సామరస్యాన్ని పాటించాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ సూచించారు. మత రాజకీ యాలు చేసే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు. సోమవారం జగిత్యాలలోని సీఎస్ఐ చర్చిలో జరిగిన యునైటెడ్ క్రిస్టియన్ ఫెలోషిప్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సతీమణి కాంతాకుమారితో కలిసి ఆయన పాల్గొన్నారు.

ఎల్వోసీ అందజేత

జగిత్యాల పట్టణంలోని బుక్కవాడకు చెందిన వావిలాల లక్ష్మీ ఆరోగ్య సమస్యతో ఇబ్బంది పడుతుండగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ రూ.4.50 లక్షల ఎల్వోసీని అందజేశారు.

చీరల పంపిణీ

సారంగాపూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండంలోని కోనాపూర్ గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు, నాయ కులతో కలిసి ప్రారంభించారు. అంతకు ముందు పెంబట్ల గ్రామంలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.13 లక్షల 80వేలతో, కోనాపూర్ గ్రామంలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు రూ.13లక్షల80 వేలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కోనాపూర్‌లో నూతన జీపీ భవనాన్ని ప్రారంభిం చారు. ఆయా గ్రామాలకు చెందిన 10 లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీపీవో రేవంత్, ఎంపీడీవో సలీం, తహశీల్దార్ వహిదోద్దిన్, డీఈ మిలింద్, చైర్మన్ మల్లారెడ్డి, ఏపీఎం చంద్రకళ, కార్యదర్శి నరేష్ పాల్గొన్నారు.

పారితోషికం అందేదెన్నడో..? 6

- కుటుంబ సర్వే డేటా ఎంట్రీ ఎన్యూమరేటర్ల ఎదురుచూపులు
- ఏడాదైనా అందని భత్యం

ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడి మృతి

● పెళ్లయిన రెండు నెలలకే ఘటన


ప్రవీణ్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామశివారులోని మూలమలుపు వద్ద ఆదివారం అర్ధరాత్రి ద్విచక్రవాహనం అదుపుతప్పి అదే గ్రామానికి చెందిన శివరాత్రి ప్రవీణ్(25) అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ప్రవీణ్ కూలి పనులు చేస్తూ జీవిస్తుండేవాడు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన యువతి స్వాతిని రెండునెలల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఈ నెల 23న ప్రవీణ్ తన కుటుంబీకులతో కలిసి మండలంలోని పదిరలో సమీప బంధువుల వివాహానికి వెళ్లాడు. అదేరోజు రాత్రి ప్రవీణ్ బంధువుకు చెందిన బైక్ తీసుకుని రాజన్నపేటలోని స్నేహితుడి భరత్ వేడుకలకు హాజరయ్యాడు. తిరుగు ప్రయాణంలో రాజన్నపేట గ్రామశివారులో ద్విచక్రవాహనం అదుపు తప్పి పక్కన ఉన్న చెట్టపొదల్లోకి దూసుకెళ్లి మృతిచెందాడు. సోమవారం ఉదయం రహదారి వెంట వెళుతున్న పలువురు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతిచెందిన వ్యక్తి గ్రామంలోని అనిల్‌గా గుర్తించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకున్నారు. వివాహమైన రెండు నెలలకే అనిల్ మృతిచెందడంతో భార్య స్వాతి రోదించిన తీరు అక్కడున్న వారిని కలిచి వేసింది. మృతుడికి భార్య స్వాతి, తల్లిదండ్రులు భాగ్య, మైసయ్య ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

కొనుగోలు కేంద్రంలో గుండెపోటుతో రైతు మృతి


సత్యనారాయణ(ఫైల్)

జమ్మికుంట రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం గండ్రపల్లికి చెందిన గండ్ర సత్యనారాయణ(54) అనే రైతు గ్రామంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రంలో సోమవారం గుండె పోటుతో మృతిచెందాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన సత్యనారాయణ తనకు ఉన్న నాలుగు ఎకరాల వ్యవసాయ భూమిలో వరి సాగు చేశాడు. నాలుగు రోజుల క్రితం గ్రామంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రానికి ధాన్యం అమ్మేందుకు తెచ్చాడు. కేంద్రం నిర్వాహకులు ధాన్యం ఎంపిక చేసి సంచులు ఇచ్చారు. కొన్ని గంటల్లో ధాన్యం అమ్ముకొని ఇంటికి వెళ్దామనుకునే లోపు ఒక్కసారిగా గుండె పోటు రావడంతో కుప్పకూలిపోయాడు. సత్యనారాయణకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రామకృష్ణగౌడ్ తెలిపారు.

వ్యవసాయ బావిలో పడి ఒకరి మృతి


నారాయణ(ఫైల్)

తిమ్మాపూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేణికుంటలో కనుకుంట నారాయణ(60) వ్యవసాయ బావిలో పడి మృతి చెందాడు. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. కనుకుంట నారాయణకు భార్య, ముగ్గురు సతానం. ఆదివారం రాత్రి ఇంట్లో నిద్రించాడు. ఇంట్లో వాళ్లు ఉదయం లేచి చూసేసరికి గదిలోలేకపోవడంతో పొలం వద్దకు వెళ్లినట్టు భావించారు. సోమవారం ఉదయం 9గంటలైనా ఇంటికి రాకపోవడంతో గ్రామంలో వెతికారు. గ్రామానికి చెందిన మంగలి లచ్చయ్య తనకు రాత్రి 10గంటలకు నారాయణ పొలం వద్దకు వెళ్తున్నట్లు కలిసి చెప్పాడని తెలిపాడు. దీంతో పొలం వద్ద వెతుకుతుండగా పెసరి చంద్రయ్య అనేవ్యక్తి వ్యవసాయ బావిలో నారాయణ మృతిచెంది కనిపించాడు. ఎల్ఎండీ పోలీసులు నారాయణ మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలిం చారు. తనతండ్రి నారాయణకు కళ్లు సరిగా కనిపించక ప్రమాద వశాత్తు కాలుజారి బావిలో పడిపోయినట్లు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సదన్ కుమార్ తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వృద్ధుడి మృతి

వీణవంక, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన రామిడి మల్లారెడ్డి(74) అనే వృద్ధుడు ప్రమాదవశాత్తు మల్లరికుంట చెరువులోపడి మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మల్లారెడ్డి గేదెలు మేపేందుకు వెళ్లి రాత్రి ఇంటికి రాలేదు దీంతోగ్రామంలో వెతకగా ప్రమాదవశాత్తు మల్లరికుంట చెరువులోపడి మృతిచెందినట్టు గుర్తించారు. మల్లారెడ్డి భార్య రామిడి లక్ష్మి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

హైదరాబాద్‌లో బుజునూర్ వాసి మృతి


వెంకట్‌రెడ్డి(ఫైల్)

ఇల్లందకుంట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుజునూర్ గ్రామానికి చెందిన కటంగూరి వెంకట్‌రెడ్డి(60) హైదరా బాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమవారం మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కటంగూరి వెంకట్‌రెడ్డి, లత దంపతులకు ఇద్దరు కూమార్తెలున్నారు. ఒకరు బెంగుళూరులో, మరొకరు హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఇటీవల హైద్రాబాద్‌లో ఉంటున్న కూతురు ఇంటికి వెంకట్‌రెడ్డి, లత దంపతులు వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చేందుకు సోమవారం ఉదయం బయలుదేరారు. రోడ్డు దాటుతున్న సమయంలో ఇద్దరినీ ఓ వ్యాన్ వేగంగా ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ వెంకట్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందగా లతకు తీవ్ర గాయాలయ్యాయి.

బావిలో దూకి యువకుడి ఆత్మహత్య

జ్యోతినగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాజిపల్లిలో బైరి రాజేష్(30) అనే యువకుడు సోమవారం బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మల్యాలపల్లికి చెందిన రాజేష్ రాజుపల్లికి చెందిన యువతితో ఐదేళ్ళ క్రితం వివాహం జరిగింది. అతను భార్యతో కలిసి సమీపంలోని మాతంగి కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో రాజుపల్లిలోని అత్తగారి ఇంటి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా మల్లన్న దేవాలయం ధ్వజస్థంభం ప్రతిష్ఠాపన


ధ్వజ స్థంభం ప్రతిష్ఠాపనలో పాల్గొన్న గ్రామస్థులు

ఇబ్రహీంపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మల్లన్న దేవాలయంలో సోమవారం నూతన ధ్వజస్థంభం ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాన్ని వేదపండితులు, గ్రామస్థులు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మల్లన్న స్వామికి ప్రత్యేకపూజలు చేయగా, భక్తులు మంగళహారతులతో మల్లన్నను కీర్తించారు. వేదపండితులు మంత్రోచ్చారణల మధ్య ధ్వజస్థంభం ప్రతిష్ఠించారు. ఈవేడుకల్లో దేవాలయ కమిటీసభ్యులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఆహార ఉత్పత్తి అభివృద్ధే లక్ష్యం

● నిరుద్యోగ యువత, సంఘాలకు వరం..
పీఎంఎఫ్ఎంఈ పథకం
● పరిశ్రమల ఏర్పాటుకు సబ్సిడీ రుణం

ఆహార ఉత్పత్తి, తయారీ రంగాల్లో నాణ్యత ప్రమాణాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పీఎంఎఫ్ఎంఈ పథకాన్ని నిర్వహిస్తున్నాయి. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను స్థాపించే యువత, స్వశక్తి సంఘాలకు 30 లక్షల రూపాయల వరకు రుణాలను అందజేసి 35 శాతం వరకు సబ్సిడీని అందజేసే ఈ పథకాన్ని ఎంవోఎఫ్‌పీఐ (మినిస్ట్రీ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్) రూపొందించింది. ఫుడ్ ప్రాసెసింగ్ యూ నిట్లను బలోపేతం చేస్తూ ఉత్పత్తులను మార్కెటింగ్, మౌలిక సదుపాయాలను ఈ పథకం కల్పిస్తుంది. పరిశ్రమల సామర్థ్యం, అభివృద్ధికి కావాల్సిన సాంకేతికతను అందజేస్తుంది. బ్యాంకుల ద్వారా రుణాలను అందజేస్తూ యూనిట్ల స్థాపనకు కృషి చేస్తుంది.

- చొప్పదండి, (ఆంధ్రజ్యోతి)

● 30 లక్షల వరకు రుణ సదుపాయం...

పీఎంఎఫ్ఎంఈ పథకం కింద ఆహార ఉత్పత్తుల(ఫుడ్ ప్రాసెసింగ్) యూనిట్ల స్థాపనకు వ్యక్తులు, స్వయం సహాయక గ్రూపులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. యూనిట్లకు లక్ష రూపాయల నుంచి 30 లక్షల వరకు బ్యాంకులు రుణాన్ని అందజేస్తాయి. 35 శాతం సబ్సిడీని 10 లక్షలకు మించకుండా అందజేస్తారు. పెద్ద పరిశ్రమకు 10 కోట్ల రూపాయల వరకు రుణాన్ని మూడు కోట్ల వరకు సబ్సిడీని అందజేస్తారు. ఎఫ్‌పీవోలు, ఎస్‌హెచ్‌జీలు, సహకార సంఘాలు, ప్రభుత్వ ఏజెన్సీలు, పెద్ద పరిశ్రమలు పెట్టేందుకు అర్హులు కాగా, పరిశ్రమల పెట్టుబడిలో 10 శాతం వాటాను చెల్లించాల్సి ఉంటుంది.



పీఎంఎఫ్ఎంఈ బ్రోచర్

● యూనిట్‌కు రుణ సదుపాయం...

బేకరీకి 10 లక్షలు, హోం ఫుడ్స్, పచ్చళ్లు, పాపడ్ తయారీకి 5 లక్షలు, రైస్ మిల్ ఏర్పాటుకు 50 లక్షల రుపాయలు అందజేస్తారు. మొబైల్ రైస్ మిల్‌కు 10 లక్షలు, గానుగ నూనె యూనిట్‌కు 8 లక్షల నుంచి 10 లక్షలు, మసాల ప్యాకింగ్ యూనిట్‌కు 4 లక్షల నుంచి 6 లక్షలు ఇస్తారు. దాల్ మిల్స్‌కు 10 లక్షల నుంచి 15 లక్షలు, స్వీట్ హౌస్ ఏర్పాటుకు 3 లక్షలు, పల్లిపట్టి యూనిట్‌కు 10 లక్షల నుంచి 20 లక్షలు, ఇన్‌స్టంట్ ఫుడ్స్ తయారీకి 10 లక్షల నుంచి 20 లక్షలు, ఫ్లోర్ మిల్లుల ఏర్పాటుకు 2 లక్షల నుంచి 5 లక్షల వరకు రుణాలు అందజేస్తారు. దరఖాస్తులను pmfme.mofpi.gov.in వెబ్‌సైట్‌లో దాఖలు చేయాలి.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక


సాత్విక

సుల్తానాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నందిమేడారంలో ఈనెల 26న జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు గర్రెపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని సాత్విక ఎంపికైంది. గర్రెపల్లి ప్రభుత్వ పాఠశాలలో 9వతరగతి చదువుతున్న సాత్విక జిల్లాస్థాయి పోటీల్లో చక్కని ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు ఆసియా తెలిపారు. సాత్వికను ప్రధానోపాధ్యాయులు కవిత, ఉపాధ్యాయబృందం అభినందించారు.

గంజాయి పట్టివేత

బుగ్గారం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బుగ్గారం మండలం గోపులాపూర్ గ్రామంలో సోమవారం పల్లెప్రకృతి వనం వద్ద గంజాయి తాగుతున్న ఇద్దరు యువకులను ఎస్సై సతీష్ పట్టుకున్నారు. గంజాయి తాగుతున్న బీహార్ రాష్ట్రానికి చెందిన కగారియా జిల్లాకు చెందిన సురాజ్‌కుమార్, రాహుల్‌కుమార్ వద్ద నుంచి 60గ్రాముల గంజాయి స్వాధీనంచేసుకొని కేసు నమోదు చేసినట్లు సతీష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గంజాయి తాగినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎస్టీ గురుకుల కళాశాల కార్యాలయానికి తాళం

● 8నెలలుగా అద్దె ఇవ్వడం లేని యజమాని ఆవేదన

మంథని, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ గిరిజనబాలికల జూనియర్ కళాశాల అద్దె భవనంలోని ఆఫీసు రూంకు భవన యజమాని మురళీధర్‌రెడ్డి సోమవారం తాళం వేశారు. తనకు 8 నెలలుగా అద్దె చెల్లించకుండా, ఖాళీ చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అద్దె విషయంలో అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో చివరకు తాళం వేయాల్సి వచ్చింది వాపోయారు. ఈ విషయం తెలుసుకున్న ప్రజా సంఘాల నేతలు బూడిద గణేష్, మంథని లింగన్న, బాబు, రవిలు అక్కడి చేరుకొని భవన యజమానితో చర్చించారు. భవనానికి తాళం వేయడం ద్వారా విద్యార్థుల విద్యకు, భోజన, వసతికి ఇబ్బందులు ఏర్పడుతాయని సూచించడంతో యజమాని శాంతించారు. ప్రజా సంఘాల నేతలు ఈ విషయాన్ని ఆర్డీవో, తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్ళడంతో డీటీ, ఆర్ఐలు అక్కడికి చేరుకొని జరిగిన ఇబ్బందిని రికార్డు చేసుకున్నారు. అనంతరం ఆర్డీవో సురేష్ యజమానికి మురళీధర్‌రెడ్డిని పిలిపించుకొని అద్దె చెల్లింపు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. దీంతో ఆయన ఆఫీసు రూంకు వేసిన తాళం తీశారు.

మైనార్టీ గురుకుల పాఠశాల ఎదుట..

విద్యార్థుల ఆందోళన

● కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్


జగిత్యాలలో మైనార్టీ పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కనీస వసతులు కల్పించాలని జగిత్యాలలోని ఖిలాగడ్డ మైనార్టీ పాఠశాల ఎదుట విద్యార్థులు సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ తమ పాఠశాలలో ల్యాబ్, లైబ్రరీ సదుపాయం లేదని, గ్రౌండ్ కూడా లేకపోవడంతో పాటు ఇతర సమ స్యలతో తాము ఇబ్బందులు పడుతు న్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రవి వైఖరి తమకు ఆవేదన కలిగించిందని ఆయనపై ఉన్నతాధి కారులు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈవిషయమై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రవిని వివరణ కోరగా మందలించే క్రమంలో ఇబ్బంది జరిగిందని భావిస్తున్నామని, మరోమారు ఇలాంటివి జరగకుండా చూసుకుంటామని ఆయన వెల్లడించారు. అనంతరం మైనార్టీ నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను సముదాయించడంతో వారు ఆందోళన విరమించారు.

హత్య కేసులో నిందితుడి రిమాండ్


నిందితుడిని అరెస్టు చూపుతున్న రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మొగ్దుంపూర్ శివారులోని ఇటుక బట్టీల్లో ఇటీవల ఒడిస్సాకు చెందిన కార్మికుడు సూరజ్‌కుంభార్(45) అనుమానాస్పదస్థితిలో మృతిచెందగా పోలీసులు సోమవారం నిందితుడిని పట్టుకుని రిమాండ్ చేశారు. కరీంనగర్ రూరల్‌సీఐ నిరంజన్‌రెడ్డి సోమవారం ఈ కేసుకు సంబంధించిన వివరాలను విలేకరులకు వెల్లడించారు. ఒడిస్సా జర్సుగూడ జిల్లాకు చెందిన సూరజ్ కుంభార్ కొన్నిరోజుల కిందట దుర్గగార్దియా మరికొందరితో కలిసి మొగ్దుంపూర్ ఇటుకబట్టీల్లో పని చేసేందుకు వచ్చాడు. దుర్గగార్దియా అదే ఇటుక బట్టీలో పనిచేస్తున్న ఒక మహిళతో చనువుగా ఉండడాన్ని సూరజ్‌కుంభార్ గమనించాడు. సూరజ్ కుంభార్ గమనిస్తున్నాడని తెలుసుకున్న దుర్గ గార్దియా అతడిపై కోపం పెంచుకున్నాడు. దుర్గగార్దియా నవంబరు 8న అర్ధరాత్రి సూరజ్‌కుంభార్ ఉన్న గదిలోకి వెళ్లి సూరజ్‌ను ఛాతి, కడుపు, పొత్తికడుపులో బలంగా తన్నడంతో స్పృహ తప్పి పడిపోగా అక్కడే వదిలేసి వెళ్లిపోయాడు. మరుసటిరోజు మిగతా వారితో కలిసి వచ్చి చూశాడు. కార్మికులు వెంటనే ఇటుకబట్టీల యజమానికి సమాచారం ఇవ్వగా ఆయన 108అంబులెన్స్‌కు ఫోన్ చేశాడు. సూరజ్ కుంభార్‌ను చూసి అప్పటికే చనిపోయాడని 108 సిబ్బంది తెలిపారు. సూరజ్ కుంభార్ మద్యం తాగి ఆహారం తీసు కోనం దున సహజంగా చనిపోయినట్లు ఉన్నాడని తోటికార్మికులతో దుర్గ గార్దియా చెప్పి యజమాని తెప్పించిన అంబులెన్స్‌లో మృతదేహాన్ని ఒడిసాకు తీసుకెళ్లారు. అక్కడికి వెళ్లిన తర్వాత కుటుంబసభ్యులు సూరజ్ సహజంగా చని పోలేదని, ఎవరో చంపి ఉంటారని అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడి పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం చేయించగా సూరజ్ శరీరం లోపలిభాగంలో బలమైన గాయాలు తగిలి చనిపోయినట్లు వెల్లడైంది. వెంటనే కేసు నమోదుచేసి కరీంనగర్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. కరీంనగర్‌రూరల్ పోలీసులు ఇక్కడ కేసు నమోదుచేసి విచారణ జరుపగా దుర్గా గార్దియనే హత్య చేశాడని వెల్లడైంది. దుర్గా గార్దియాను సోమవారం బొమ్మకల్ గ్రామంలోని గుంటూరుపల్లి వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారించగా తాను కొట్టిన దెబ్బలతో సూరజ్ చనిపోయినట్లు దుర్గా గార్దియా నేరం ఒప్పుకున్నాడు. సమావేశంలో ఎస్ఐ నరేష్, అంజద్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

మెట్‌పల్లి రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడుట్రాక్టర్లను పట్టుకున్నట్లు తహసీల్దార్ నీత తెలిపారు. కథలపూర్ మండలంనుంచి రాత్రివేళల్లో ఇసుకను తరలిస్తూ మండలంలోని రామలచ్చక్కపేట గ్రామశివారులో అక్రమంగా నిల్వచేసి ఉదయం ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారని సమాచారం రావడంతో సోమవారం రెవెన్యూ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈతనిఖీల్లో రామలచ్చక్కపేట, మెట్లచిట్టాపూర్ గ్రామాలమధ్య కోతకు గురైన వరదకాలువ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా వెల్లుల్ల గ్రామశివారులో మూడుట్రాక్టర్లను పట్టుకుని మెట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నీత మాట్లాడుతూ నిబంధ నలు అతిక్రమించి అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

ఇబ్రహీంపట్నం: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తహసీల్దార్ వరప్రసాద్ తెలిపారు. మల్లాపూర్ మండలం వాల్గొండ గ్రామంనుంచి మండలంలోని యామపూర్ గ్రామానికి ఇసుకను అనుమతులు లేకుండా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నామన్నారు. మరో ట్రాక్టర్‌ను నిజా మాబాద్ జిల్లా భట్టాపూర్ నుంచి మండలంలోని కోమటి కొండాపూర్‌గ్రామానికి తరలిస్తుండగా పట్టుకున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. ఒక్కొక్కరికి రూ.10వేలజరిమానా విధించినట్లు తెలిపారు.

బంగారం చోరీ

వీణవంక, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనపర్తి గ్రామానికి చెందిన కొయ్యడ మధునమ్మ ఇంట్లో పావు తులం బంగారం దొంగలు ఎత్తుకెళ్లారు. పోలీసులు వివరాల ప్రకారం.. మధునమ్మ కూలి పనులకు వెళ్లి వచ్చేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. బీరువాలోని వస్తువులు చిందర వందరగా పడేశారు. బియ్యం డబ్బాలో దాచుకున్న పావుతులం బంగారం దొంగలు ఎత్తుకెళ్లారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తిరుపతి తెలిపారు.

గవర్నర్‌కు ఎస్‌యూ వైస్ చాన్సలర్ కృతజ్ఞతలు


గవర్నర్‌ను కలసి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎస్‌యూ వీసీ యు.ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గవర్నర్, విశ్వవిద్యాలయ కులపతి జిష్ణుదేవ్ వర్మకు శాతవాహన విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఎస్‌యూ రెండో స్నాతకోత్సవానికి హాజరైన సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో కలిసి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ స్నాతకోత్సవ ఏర్పాట్లు అద్వితీయంగా ఉన్నాయని కితాబిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

తంగళ్లపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రంలో ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టడంతో ఇద్దరు తీవ్రంగా గాయ పడ్డారు. మండలకేంద్రానికి చెందిన రఘునందన్, పర్శరాములు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కారుఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే వారిని 108 వాహనంలో జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రికి తరలించారు.

పారితోషికం అందేదెన్నడో..?

● కుటుంబ సర్వే డేటా ఎంట్రీ ఎన్యూమరేటర్ల ఎదురుచూపులు ● ఏడాదైనా అందని భత్యం


కుటుంబ సర్వే డాటా ఎంట్రీ చేస్తున్న ఆపరేటర్లు(ఫైల్)

మల్యాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గతేడాది నవంబరులో చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వే డేటా ఎంట్రీ చేసిన ఎన్యూమరేటర్లకు ఏడాదిగా తమకు చెల్లించాల్సిన బకాయిల కోసం ఎదురు చూస్తున్నారు. మల్యాల మండల వ్యాప్తంగా అధికారులు చేసిన ఇంటింట కుటుంబ సర్వే డేటాను 122మంది ఎన్యూమరేటర్లు ఇరవై వేలకు పైగా సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయాలు, నాచుపల్లి జేఎన్‌టీయూ కళాశాలలో అక్కడి విద్యార్థులు మండలంలోని పలువురు యువతీయువకులు వివరాలు నమోదు చేశారు. అయితే వారికి ఎంట్రీ పూర్తి కాగానే చెల్లించాల్సిన పారితోషికను చెల్లించకపోవడంతో ఏడాది కాలంగా జిల్లా ఉన్నతాధికారులకు, ప్రజావాణిలో తమ విన్నపాలు వినిపిస్తూనే ఉన్నారు. అయితే వారి విన్నపాలు పట్టించుకోవడం లేదు.

● ఒక్కో ఎంట్రీకి రూ.30

సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించి ఒక్కో ఎంట్రీకి రూ.30 చెల్లించనున్నట్లు అధికారులు పేర్కొనడంతో పదుల సంఖ్యలో ఎన్యూమరేటర్లు ముందుకు వచ్చి డాటా ఆన్‌లైన్ చేశారు. మల్యాల మండలమే కాకుండా ఇతర మండలాలకు చెందిన వాటి సర్వే వివరాలను నమోదు చేయగా ఒక్కోక్కరికి కనీసం రూ.పది వేల నుంచి ఇరవై వేలకు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. వెంటనే తమకు డబ్బులు చెల్లించాలని ఎన్యుమరేటర్లు కోరుతున్నారు.

● త్వరగా చెల్లించాలి

- రుత్త గంగాధర్, ఎన్యూమరేటరు, మల్యాల

గత ఏడాది నవంబరు 30 నాటికి తాము డాటా ఎంట్రీ పూర్తి చేయగా అప్పటి నుంచి తమకు చెల్లిస్తామన్న డబ్బులు రాలేదు. అధికారుల దృష్టికి తీసుకెళ్లిన్నప్పటికీ వారి నుంచి ఎలాంటి స్పందన లేదు. ఇప్పటికైన తమకు ఎంట్రీకి సంబందించిన సొమ్ములు వెంటనే చెల్లించాలి.

మత్స్యకార రాష్ట్ర మహాసభలను

విజయవంతం చేయండి

సుభాష్‌నగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మికుల సంఘం 4వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సంఘం నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని రెవెన్యూ గార్డెన్‌లో ఈ నెల 25 నుంచి 27 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేరళ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ స్టాన్లీ, రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి వాకాటి శ్రీధర్, రవాణా బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆహ్వానించినట్లు చెప్పారు. రాష్ట్రంలో మత్స్యవృత్తిపై ఆధారపడి సుమారు 10 లక్షల కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయని, 5,650 మత్స్య సహకార సంఘాల్లో 5 లక్షల 40 వేల మంది సభ్యులుగా ఉన్నారని అన్నారు. రాష్ట్రంలో కృష్ణ, గోదావరి నదులతోపాటు అనేక ఉప నదులు, 42 వేల చెరువులు, కుంటలు, 62 రిజర్వాయర్లు, సుమారు 7 లక్షల హెక్టార్లలో విస్తారమైన జలవనరులు ఉన్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత భూముల ధరలు విపరీతంగా పెరిగాయని, రియల్ ఎస్టేట్ మాఫియా, అధికార, ప్రతిపక్ష రాజకీయ దళారీలు పెద్ద ఎత్తున చెరువులు, కుంటలను కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రానున్న బడ్జెట్‌లో మత్స్య వృత్తి రక్షణ-మత్స్యకారుల సంక్షేమానికి రూ. 5,000 కోట్లు కేటాయించాలని, మత్స్యకారుల భద్రతకు ఇన్సూరెన్స్, ఎక్స్‌గ్రేషియాను రూ.20లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఉమ్మడి రాష్ట్ర మాజీ చైర్మన్ చేతి ధర్మయ్య, సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి లెల్లెల బాలకృష్ణ, జిల్లా అధ్యక్షుడు పిట్టల వెంకటేష్, ప్రధానకార్యదర్శి గణేశ్, కోశాధికారి పప్పు సదానందం, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ప్రమాదంలో మహిళకు గాయాలు

ధర్మారం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పొలం పనికి వెళ్లిన మహిళ నిలువ నీడ కోసం ట్రాక్టర్ క్రింద కూర్చోగా, గమనించని డ్రైవర్ ట్రాక్టర్ తీయడంతో మహిళకు గాయలయ్యాయి. మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన దీకొండ సుగుణ వారి వ్యవసాయ పనుల నిమిత్తం పొలం వద్దకు వచ్చింది. ఎండ తీవ్రత ఎక్కువ ఉండడంతో కాసేపు సేదతీరడం కోసం పొలంలోని ట్రాక్టర్ ట్రాలీకింద కూర్చుంది. మహిళను గమనించని డ్రైవర్ ట్రాక్టర్ తీయగా సుగుణ కాలు విరిగింది. సమా చారం అందుకున్న 108సిబ్బంది చికిత్స నిమిత్తం ఆమెను కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

ఇందిరమ్మ లబ్ధిదారులకు

రుణ సౌకర్యం

- స్వయం సహాయక సంఘాల ద్వారా రూ. రెండులక్షల వరకు..
- సంఘంలో తీర్మానం తప్పనిసరి



కరీంనగర్ రూరల్ మండలంలో పునాది దశలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లు, బహదూర్‌ఖాన్ పేటలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లు

కరీంనగర్ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు నాలుగు విడతల్లో ఐదు లక్షల రూపాయలను ప్రభుత్వం అందజేస్తుంది. పునాది పూర్తయితేనే ప్రభుత్వం మొదటి విడత నిధులు మంజూరు చేస్తుంది. లబ్ధిదారుల్లో పేదలే అధికంగా ఉండడంతో ఇంటి నిర్మాణానికి డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి వారికి స్వయం సహాయక సంఘాల ద్వారా 50 వేల నుంచి రెండు లక్షల రూపాయల వరకు రుణం అందజేస్తున్నారు. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఊరట కలుగుతోంది. కరీంనగర్ రూరల్ మండలంలో 14 గ్రామాల్లో 1,164 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా వివిధ కారణాల వల్ల 22 రద్దయ్యాయి. ప్రస్తుతం 1,142 ఇళ్లకు గాను 546 ఇళ్లకు ముగ్గులు పోశారు. పునాదుల వరకు 50 ఇళ్లు, రూఫ్ లెవల్ వరకు ఆరు ఇళ్లు పూర్తయ్యాయి. 37 ఇళ్లకు స్లాబ్ వేశారు. ఇందులో స్వయం సహాయక సంఘంలో సభ్యులైన 106 మంది లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణానికి 1.06 కోట్ల రూపాయల రుణం అందించారు. ఇల్లు మంజూరై, మహిళా సంఘంలో సభ్యులైన వారు మాత్రమే రుణానికి అర్హులు. అవసరమైన వారు మహిళా సంఘంలో తీర్మానం చేయించి సంబంధిత ఏపీఎం, సీసీలను కలిస్తే బ్యాంకుల ద్వారా రుణం అందించేలా చర్యలు తీసుకుంటారు.

● ఉపాధి హామీ తోడ్పాటు

ఇళ్ల నిర్మాణానికి సంబంధించి రుణాలే కాకుండా ఉపాధి హామి పథకం ద్వారా ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోంది. లబ్ధిదారుల ఆర్థిక సమస్యలు, కూలీల కొరత తదితర ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ చర్యలు తీసుకుంటోంది. ఉపాధి హామి జాబ్ కార్డు ఉండి ఇందిరమ్మ ఇళ్ళ పథకంలో లబ్ధిదారులైన వారికి 90 రోజుల హాజరు వేస్తారు. ఈ పని దినాలకు సంబంధించిన 27 వేల రూపాయలను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తారు. పునాది నిర్మాణం నుంచి స్లాబ్ పూర్తయ్యే వరకు 90 రోజుల పని దినాలు కల్పిస్తూ లబ్ధిదారులకు ప్రభుత్వం కొంత మేర ఆసరా కల్పిస్తుంది.

తక్కువ వడ్డీతో రుణాలు...

- రామ్మోహన్, ఐకేపీ ఏపీఎం

ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు ఇస్తున్నాము. సంఘంలో సభ్యురాలై ఉండి తీర్మానం చేసి పంపితే నిర్మాణానికి బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీతో రుణాలిస్తున్నాము. లబ్ధిదారులు ప్రతినెలా కిస్తీలను కట్టుకుంటే సరిపోతుంది.

సామాజిక కార్యకర్త

బక్క జడ్సన్‌ను విడుదల చేయాలి



ధర్నా చేస్తున్న రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

గణేశ్‌నగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సామాజిక కార్యకర్త బక్క జడ్సన్‌ని విడుదల చేయాలని రిటైర్డ్‌ఎంప్లాయీస్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ కోహెడ చంద్రమౌళి డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ చౌక్‌లో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి నుంచి రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలని గవర్నర్ కార్యాలయంలో మూడుసార్లు మెమోరాండం ద్వారా విన్నవించినా స్పందించకపోవడంతో మరోసారి రాజ్‌భవన్‌కు జడ్సన్ వెళ్లారని, అనుమతించకుండా అరెస్టు చేయడం అన్యాయమని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకిశాల ప్రభాకర్‌రావు మాట్లాడుతూ 2024మార్చి నుంచి రిటైర్డ్ ఉద్యోగులకు ఉపాధ్యాయుల బకాయిలను చెల్లించని పక్షంలో డిసెంబర్ మొదటివారంలో ఆమరణ నిరాహారదీక్ష చేపడతామన్నారు. సమావేశంలో జిల్లాఉపాధ్యక్షుడు గద్ద జగదీశ్వరాచారి, కోశాధికారి కనపర్తి దివాకర్, బోరుపల్లి రవీందర్, పాలు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 8060కే సీసీఐ పత్తి కొనుగోలు

చొప్పదండి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బీపీ స్పెషల్ మోడ్ పత్తి ధర క్వింటాల్‌కు 8060 రూపాయలకే కొనుగోలు చేయనున్నట్లు సీసీఐ ప్రకటించిందని మార్కెట్ కార్యదర్శి రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు విషయాన్ని గమనించాలని, పత్తి అమ్మకానికి స్లాట్ బుకింగ్ చేసుకోవాలని పేర్కొన్నారు.

అవినీతిరహిత సమాజం కోసం..

యువత రాజకీయాల్లోకి రావాలి

- రాష్ట్రీయ లోక్‌దళ్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్



జగిత్యాలలో మాట్లాడుతున్న రాష్ట్రీయ లోక్‌దళ్ రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ కుమార్

జగిత్యాల అర్బన్, నవంబర్ 24 (ఆంధ్రజ్యోతి): అవినీతి రహిత సమాజం కోసం యువత రాజకీయాల్లోకి రావాలని రాష్ట్రీయ లోక్‌దళ్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ పిలుపునిచ్చారు. రాష్ట్రీయ లోక్‌దళ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక చైతన్య రథయాత్రలో భాగంగా సోమవారం జగిత్యాలలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పాలించిన బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్‌పార్టీలు తెలంగాణకు ద్రోహం చేశాయని విమర్శించారు. ప్రత్యేకతెలంగాణ ఏర్పడితే రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని భావించిన లక్షలాదిమంది యువత తెలంగాణ ఉద్యమంలో పనిచేశారన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత యువత ఆశలు అడియాసలు అయ్యాయని విమర్శించారు. భౌగోళిక తెలంగాణ ఏర్పడిందే తప్ప సామాజిక తెలంగాణ ఏర్పడలేదన్నారు. విద్య, వైద్యం, ఉపాధివంటి కీలక వ్యవస్థలు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆయన ఆరోపించారు. ఇప్పటికి కనీసం రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాల్సి ఉందని, 28లక్షల మంది యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా కృషి చేయడంలో రాష్ట్రప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ఐక్యతతోనే బహుజనులకు రాజకీయ అధికారం వస్తుందని ఆ దిశగా రాష్ట్రీయ లోక్‌దళ్ పార్టీ కృషి చేస్తుందన్నారు. యువతను రాజకీయాల్లోకి ఆహ్వానించడంతో పాటు వారికి ఉపాధి కల్పించే విషయంలో తమపార్టీ తెలంగాణలోని అన్ని జిల్లాలలో జాబ్ మేళాలను నిర్వహించి ఉద్యోగ, ఉపాధిఅవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. వచ్చే స్థానికసంస్థల ఎన్నికల్లో తమపార్టీ ఆధ్వర్యంలో యువతకు ఎక్కువ సీట్లు కేటాయించి అన్ని విధాలా ప్రోత్సహిస్తామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని, చివరికి రిటైర్డ్ ఉద్యోగులకు అందాల్సిన ప్రయోజనాలను కూడా ప్రభుత్వం దారి మళ్లించడం అన్యాయమన్నారు. బీసీలకు 42శాతం చట్టబద్ధ రిజర్వేషన్ అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చకపోవడంతో ప్రజలు అధికార పార్టీపై తీవ్రఆగ్రహంతో ఉన్నారన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలు విస్మరించడంతో వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలను చైతన్యం చేసి వారిని రాజకీయ అధికారానికి దగ్గర చేయడం కోసం తమ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో సామాజిక చైతన్య యాత్రలను నిర్వహిస్తున్నామని కపిలవాయి దిలీప్ కుమార్ తెలిపారు. సమావేశంలో ఆర్ఎల్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రిషబ్ జైన్, హసన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా ఇన్‌ఫ్లో

జగిత్యాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి సోమవారం స్వల్పంగా నీరువస్తోంది. ఎగువ ప్రాంతంనుంచి ప్రాజెక్టులోకి 1,338 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నుంచి సరస్వతీ కాలువద్వారా 650 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం మిషన్ భగీరథ ద్వారా 231క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 457 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 80.501 టీఎంసీలు కాగా అంతేస్థాయి నీటిమట్టంతో ప్రాజెక్టు నిండుకుండలా ఉంది. ప్రాజెక్టులోకి ఈ యేడాది జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు 947.821 టీఎంసీల నీరు వచ్చిచేరగా, ప్రాజెక్టు నుంచి 880.108 టీఎంసీల నీరును దిగువకు వదిలారు.

వేములవాడ, కొండగట్టుకు పోటెత్తిన భక్తులు

- వేములవాడకు 50వేలకు పైగా భక్తుల రాక
- ఎల్ఈడీ స్క్రీన్‌లో రాజన్న దర్శనం



భీమన్న సన్నిధిలో భక్తుల రద్దీ

వేములవాడ టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వేములవాడలో భక్తజనసంద్రమైంది. రాష్ట్ర నలుమూలల నుంచి దాదాపు 50వేలకు పైగాభక్తులు తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించారు. భీమేశ్వరాలయంలో స్వామివారి దర్శనానికి రెండుగంటల సమయం పట్టింది. ఎల్ఈడీ స్క్రీన్‌లోనూ రాజన్న దర్శనానికి రద్దీఏర్పడింది. ఆలయ పరిసరాలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. వేలాదిమంది భక్తులు తలనీలాలు సమర్పించారు. ఓ వైపు ఆలయ విస్తరణ పనుల్లో భాగంగా భీమన్నను భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి ఇబ్బందుల పాలయ్యారు. ఎల్ఈడీ స్క్రీన్‌లో రాజరాజేశ్వర స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. భీమేశ్వరస్వామి దేవస్థానంలో వేలాదిమంది భక్తులు కోడెల మొక్కులు చెల్లించారు. ఆలయంలో స్వామివారికి భక్తులు అభిషేక పూజలు చేశారు. నిత్యాన్నదాన సత్రం పై అంతస్తులో కల్యాణం, సత్యనారాయణస్వామివ్రతాలు నిర్వహించారు. అనేకమంది భక్తులు కుంకు మపూజలు, పెద్ద పల్లకి సేవలు చేపట్టి భక్తినిచాటారు. అనంతరం భీమేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. భీమన్న సన్నిధిలో క్యూలైన్‌లోనే ఆలయ ఇవో వెళ్లి భక్తుల సమస్యలు అడిగి తెలుసు కున్నారు. భీమేశ్వరస్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు బద్దిపోచమ్మకు బోనాలు సమర్పించారు.

కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల : కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధికి సోమవారం సాయంత్రం నుంచి రాత్రివరకు వేలాదిగా భక్తులు చేరుకోవడంతో కొండంతా రద్దీగా మారింది. సమ్మక్క, సారలమ్మ జాతరకు ముందు సోమవారం వేములవాడ రాజన్నను దర్శించుకొని మంగళవారం కొండగట్టు అంజన్నను దర్శించుకోవడం ఆనవాయితీ కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వందలాది వాహనాల్లో భక్తులు కొండపైకి చేరుకున్నారు. దేవస్థానం పరిధిలోని సత్రాలు భక్తులతో నిండి పోగా, గదులు లేక చలిలో ఆరుబయట పడుకొని తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఈ సీజన్‌లో భక్తులు అధికసంఖ్యలో తరలివస్తారని తెలిసినప్పటికీ దేవస్థానం తరుపున కనీస సౌకర్యాలు కల్పించకపోవడం పట్ల స్థానికులు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

● సెల్‌ఫోన్ అప్పగింత..

కొండగట్టు అంజన్న దర్శనానికి వచ్చిన హైదరాబాద్‌కు చెందిన విజయకుమార్‌రావు అనే భక్తుడు సెల్‌ఫోన్ పోగొట్టుకోగా అక్కడి పోలీసులకు దొరికింది. దీంతో విచారణ జరిపిన అనంతరం పోలీస్ అవుట్ పోస్టు ఏఎస్సై చిలుక శ్రీనివాస్ సెల్‌ఫోన్ భక్తుడికి అప్పగించారు.



కొండగట్టులో పార్కింగ్ స్థలంలో భక్తుల వాహనాలు

రాజుపేటలో దొంగల బీభత్సం

- బంగారం, వెండి, నగదు అపహరణ

గంభీరావుపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం రాజుపేట గ్రామంలో ఆదివారం దొంగలు బీభత్సం సృష్టించారు. తాళాలు వేసిన ఇళ్లలోకి చొరబడి బంగారు, వెండి ఆభరణాలతోపాటు నగదు ఎత్తుకెళ్లారు. సుద్ద దేవవ్వ, దిడ్డి మణెవ్వ, బండి లచ్చవ్వ, బండి వెంకట, దిడ్డి కిష్టయ్యల ఇళ్ల తాళాలు పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. ఐదుఇళ్లలో దొంగలు చొరబడి దొంగతనానికి పాల్పడ్డప్పటికీ, రెండు ఇళ్ళలో మాత్రమే చోరీ జరిగింది. ఇండ్లకు తాళం వేసి కొందరు బంధువుల వద్దకు వెళ్లగా, మరి కొందరు శుభ కార్యం నిమిత్తం ఇతర గ్రామాలకు వెళ్లారు. దేవవ్వ మాత్రం ఇంటికి తాళంవేసి పక్కనే ఉన్నవారి అక్కఇంట్లో నిద్రించింది. అయితే దేవవ్వ అక్క ఇంటికి గొళ్లెం పెట్టి దేవవ్వ ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. మరో ముగ్గురి ఇళ్ల తాళాలను దొంగలు పగుల గొట్టి లోనికి వెళ్లి దొంగతనానికి ప్రయత్నిస్తుండగా, సమీప ప్రజలు మేలుకుని కేకలు వేయ డంతో దొంగలు పారిపోయినట్లు తెలుస్తోంది. దేవవ్వ ఇంట్లో 4 తులాల బంగారు అభర ణాలు, 50 తులాల వెండి ఆభరణాలు, రూ. 50వేల నగదు ఎత్తుకెళ్లారు. మణెమ్మ ఇంట్లో 4తులాలన్నర బంగారం, 10తులాల వెండి. రూ.32వేల నగదు ఎత్తుకెళ్లారు. సంఘటన స్థలానికి సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి వచ్చి పరిశీలించారు. అప్పట్లో నాగంపేటలో జరిగిన దొంగతనంపై కూడా డీఎస్పీ ఆరా తీశారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ తనిఖీ చేశారు.

చోరీ కేసులో నిందితుడికి సంవత్సరం జైలు శిక్ష

సిరిసిల్ల రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో నిందితుడికి ఒక సంవత్సరం జైలు శిక్ష విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ సోమవారం తీర్పు వెల్లడించినట్లు సిరిసిల్ల పట్టణ సీఐ కృష్ణ తెలిపారు. సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టౌన్‌సీఐ మాట్లాడారు. సిరిసిల్లలోని సంజీవయ్యనగర్‌కి చెందిన దరిపల్లి రమేష్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ యేడు ఏప్రిల్‌లో కుటుంబసభ్యులతో కలసి ఎల్లమ్మ దేవుని పండుగ చేసుకోవడానికి సొంత గ్రామమైన కనగర్తికి వెళ్లాడు. రమేష్ తమ్ముడు సురేష్ ఫోన్ చేసి ఇంట్లో దొంగలు పడ్డారని చెప్పగా రమేష్ వెంటనే ఇంటికి వచ్చి చూడగా బీరువా తాళాలు తెరిచి సామానులన్నీ చిందరవందరగా పడేసి ఉన్నాయి. బీరువాలో దాచిపెట్టిన 8తులాల బంగారు ఆభరణాలతో పాటు 20తులాల వెండి ఆభరణాలు చోరీ చేసినట్లు గుర్తించారు. దీంతో రమేష్ సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ శేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా దొంగతనం చేసిన వడ్డేపల్లి సత్యం అనే వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. తర్వాత కోర్టు మానిటరింగ్ ఎస్ఐ ఆధ్వ ర్యంలో కోర్టు కానిస్టేబుల్ వేముల నరేష్ ఆరుగురు సాక్షులను ప్రవేశ పెట్ట ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెలుమల సందీప్ వాదించారు. న్యాయమూర్తి ప్రవీణ్ నిందితుడు వడ్డేపల్లి సత్యంకు ఒక సంవత్సరం కఠిన కారాగార జైలుశిక్ష విధించినట్లు తెలిపారు.

రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులు



బాబును, ప్రణతిని అభినందిస్తున్న పాఠశాలల సిబ్బంది

కొడిమ్యాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వజూనియర్ కళాశాలకు చెందిన కెబాబు కబడ్డీక్రీడల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కె వేణు తెలిపారు. దీంతోకళాశాల సిబ్బంది విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ బి నర్సయ్య, అధ్యాపకుడు నర్సయ్యసిబ్బంది ఉన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు..

తిమ్మాపూర్: మండల కేంద్రంలోని మోడల్ కళాశాలలో ఎంపీసీ ఫస్ట్ ఇయర్ చదువుతున్న ప్రణతి జాతీయస్థాయి కబడ్డీజట్టుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వనజ తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఫిజికల్ డైరెక్టర్ నాగరాజును ప్రిన్సిపాల్, అధ్యాపకులు, అభినందించారు.

బొంతకుంటపల్లిలో కొండచిలువ హతం

సుల్తానాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంతకుంటపల్లిలో సోమవారం రైతులకు కొండచిలువ కనిపించింది. రైతులు పొలం పనుల్లో నిమగ్నమై ఉండగా, ఒక్కసారిగా మీదకు రావడంతో దానిని కర్రలతో కొట్టిచంపివేశారు. ఇటీవల పలుగ్రామాల్లో కొండచిలువ కనిపించడం, రైతులు, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.



కొండచిలువతో గ్రామస్థులు

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



హోమం నిర్వహిస్తున్న పండితులు

కొడిమ్యాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండల కేంద్రంలోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వెంకటేశ్వరస్వామి వైభవంగా బ్రహ్మోత్సవాలు కొన సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజు సోమవారం వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో స్వామి వారికి పండితులు ఘనంగా ప్రత్యేక పూజలు చేసారు. ఆలయ ప్రాంగణంలో పరివార హోమం, దేవతా ఆహ్వానం కార్యక్రమాలను పండితులు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్మాణకమిటీ వారు, భక్తులు గ్రామస్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీసభ్యులు, గ్రామ ప్రముఖులు, భక్తులు వందలాదిగా పాల్గొన్నారు.

కన్నుల పండువగా నారికేళ దీపోత్సవ శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు

కరీంనగర్ కల్చరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని భగత్‌నగర్ అయ్యప్ప దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన నారికేళ దీపోత్సవ శోభాయాత్ర కన్నులపండువగా సాగింది. గోవిందపతి శ్రీవారి సేవా సమితి సహకారంతో శోభాయాత్ర చేపట్టారు. మహిళలు కొబ్బరి ముక్కల్లో దీపాలు వెలిగించి మంకమ్మతోట వేంకటేశ్వరాలయంలో పూజలు చేసి అయ్యప్ప ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్, నాయకులు మల్లికార్జున రాజేందర్, కటకం వెంకటరమణ, జీఎస్ ఆనంద్, అయ్యప్ప ఆలయ చైర్మన్ వై. అనిల్‌కుమార్‌గౌడ్, ఈవో కొన్న కాంతారెడ్డి, వేంకటేశ్వరాలయ ఈవో శ్రీనివాస్, గోవిందపతి శ్రీవారి సేవాసమితి అధ్యక్షుడు పాలవేడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలయంలో పల్లకీసేవ

పెగడపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) :పెగడపల్లి మండల కేంద్రంలోని రాజరాజేశ్వరస్వామి ఆలయంలో సోమ వారం పల్లకీ సేవ వైభవంగా నిర్వహిం చారు. సోమవారం పురస్కరించుకుని ఉత్సవ విగ్రహాలను పల్లకీలో పెట్టి ప్రత్యేక పూజలనంతరం ఆలయం చుట్టూ భక్తులు పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం ఆలయకమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ ఒరుగల శ్రీనివాస్, రాంచంద్రం, శేఖర్, పార్థసారథి, గోపికృష్ణ, కమిటీ సభ్యులు, అర్చకులు గుండి శ్రీనివాస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ధర్మపురి, నవంబర్, 24 9ఆంధ్రజ్యోతి) :ధర్మపురి పట్టణంలోని గోలివాడకు చెందిన ఎడమలపెల్లి శంకర్ అంబులెన్స్ డ్రైవర్ గుండెపోటుతో మృతిచెందగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దామెర రాంసుధాకర్ రావు ద్వారా రూ.10వేలు ఆ కుటుంబానికి నేతలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో బీజేపీ ధర్మపురి పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్ అన్నపూర్ణ, సత్య అన్నదాన సత్రం వ్యవస్థాపకులు నరేందర్, బీజేపీ జిల్లా కార్యదర్శి లవణ్ పాల్గొన్నారు.

108 అంబులెన్స్ తనిఖీ

రాయికల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండల కేంద్రంలోని 108 అంబులెన్స్ పరికరాలను 108 జిల్లా మేనే జర్ యశోద ఐలయ్య సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సంద ర్భంగా అంబులెన్స్‌లో ఉన్న వెంటిలేటర్, మల్టీఛానల్ మానిటర్‌తో పాటు ఇతర వైద్య పరికరాల పనితీరు, ఆక్సీజన్, అత్యవసర పరిస్థితుల్లో అవసర మయ్యే మందులను, పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే 102 వాహనాన్ని కూడా తనిఖీ చేశారు. సిబ్బంది నూకపెల్లి మల్లారెడ్డి, సంధ్య, నాగరాజు ఉన్నారు.

కారు ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ కార్యవర్గం

జగిత్యాల అర్బన్, నవంబర్ 24 (ఆంధ్రజ్యోతి): కారు డ్రైవర్స్ అండ్ ఓనర్స్ జిల్లా అధ్యక్షులుగా సురుగు వెంకటేష్ ఎంపికయ్యారు. సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో జిల్లా కారు డ్రైవర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉపాధ్య క్షులుగా దాది రఘుపతి, కార్యదర్శిగా దండె రమేష్, కోశాధికారిగా మధురవేణి మహేష్, అదనపు కార్యదర్శిగా మాలి కిషన్, తదితరులు ఎంపికయ్యారు. ఈ కార్యక్ర మంలో జిల్లా కారు డ్రైవర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ధర్మపురి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో మైదం బాలవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించారు. ధర్మపురి పట్టణంలో ఎస్సీ కాలనీకి చెందిన బడుగు భూలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందగా కుటుంబ సభ్యులను మాజీ మంత్రి ఈశ్వర్ పరామర్శించారు. ఆయన వెంట డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ధర్మపురి మాజీ ఎంపీపీ సౌళ్ల భీమయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరు రాజేష్‌కుమార్, మాజీ సర్పంచులు పులిశెట్టి మల్లేశం, ఒడ్నాల మల్లేశం, సంగి శేఖర్ పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

●రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వికలాంగుల సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్




కోరుట్లలో మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి, గొల్లపల్లిలో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న మంత్రి అడ్లూరి

కోరుట్ల రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మహిళల ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని పట్టణంలోని మోహన్ రావుపేట గ్రామంలోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ సత్యప్రసాద్‌లతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ జన్మదినం సందర్భంగా తెలంగాణ ఆడ పడుచులకు రేవంత్‌అన్న చీరల పంపకం కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మాట్లాడుతూ మహిళలకు చీరలు అందించడం అభినందనీయమని అన్నారు. గత ప్రభుత్వం దసరా పండగకు చీరలు అందించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి రఘువరన్, ఆర్‌డీఓ జీవకర్‌రెడ్డి, తహసీల్దార్ కృష్ణ చైతన్య, ఎంపీడీఓ రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

●**గొల్లపల్లి:** పేదల సొంతింటి కలను ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సాకారం చేస్తున్న ఘనత కాంగ్రెస్‌దేనని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం గొల్లపల్లి మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఆవుల సాయవ్వ అనే నిరుపేద మహిళ ఇంటి నిర్మాణం పూర్తి చేసుకొని నూతన గృహ ప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కలెక్టర్ సత్య ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ సత్య ప్రసాద్‌తో కలిసి నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిలో సామూహిక భోజనం ఆరగించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి, యూత్ అధ్యక్షులు పురంశెట్టి గౌతమ్ రాజు, మాజీ ప్రజా ప్రతినిధులు గంగాధర్, సత్యానారాయణ, రాజ్యలక్ష్మీ తిరుపతి రెడ్డి, పద్మవెంకటేశం, వెంకటేష్ గౌడ్, హరికిరణ్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

●**ఎండపల్లి:** మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు సీఎం రేవంత్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతున్నారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని రాజారాంపల్లి ఎస్ఆర్ గార్డెన్‌లో కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి ఇందిరా మహిళా శక్తి చీరలను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల శాఖ అధికారులతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భక్తుల పెన్నిధి.. మల్లన్న సన్నిధి

●నేటి నుంచి మల్లికార్జున స్వామి జాతర



ముస్తాబైన మల్లికార్జున స్వామి ఆలయం

గొల్లపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గొల్లపల్లి మండలం మల్లన్నపేట గ్రామంలో దొంగ మల్లన్నగా ప్రసిద్ధి గాంచిన మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు మంగళవారం నుంచి ఘనంగా ప్రారంభం కానున్నాయి. ఈ నెల 25న స్వామి వారి కల్యాణ మహోత్సవంతో ప్రారంభమయ్యే జాతర ఉత్సవాలు వచ్చే నెల 18 తేదీ వరకు 25 రోజుల పాటు అంగరంగవైభవంగా కొనసాగు తాయి. గొల్లకుర్మలు శ్రీ మల్లిఖార్జున స్వామిని దొంగ మల్లన్న జాతరగా పిలుచుకుంటారు. ఉత్సవాలకు ఆల యాన్ని ముస్తాబు చేశారు. దేవాలయానికి రంగులు వే శారు. ఆలయం ముందు భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్ల వేసి జాతరకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశారు.

●**కార్యక్రమాల వివరాలు**

మంగళవారం మల్లికార్జున స్వామి వారి కల్యాణ మహోత్సవంతో ఉత్సవాలు ఘనంగా ప్రారంభ మవుతాయి. బుధవారం స్వామివారి దండి వారం, శుక్రవారం స్వామివారి నాగవెల్లి కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. వచ్చే నెల డిసెంబరు 18న రుద్రాభిషేకం, పూర్ణాహుతితో ఉత్సవాలు వైభవంగా ముగుస్తాయి.

ఉత్సవాలను విజయవంతం చేయాలి

-ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్

మల్లిఖార్జున స్వామి జాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జాతర ఉత్సవాలను దిగ్విజయం చేయాలని ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్, ఆలయ ఫౌండరీ ట్రస్టీ కొండూరి శాంతయ్య పేర్కొన్నారు. ఉత్సవాలను ఏడు వారాల పాటు అంగరంగవైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని వారు పేర్కొన్నారు.

కార్యదర్శిపై ఫిర్యాదు

కొడిమ్యాల, నవంబరు24(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెప్యాల గ్రామ పంచాయతీ కార్యదర్శి స్వామి విధులు సక్రమంగా నిర్వహించడం లేదని సోమవారం ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు గ్రామ మాజీ సర్పంచు అక్కపెల్లి రాజేశం తెలిపారు. తాగు నీటి పైపులు లీకవుతున్న పట్టించుకోవటం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై గ్రామ కార్యదర్శి స్వామిని వివరణ కోరగా మృతి చెందిన వారి పేర్లను రిజిస్టర్ నుండి తొలిగించామన్నారు. సీసీ రోడ్డు, ఆర్అండ్‌బీ రోడ్డు కింద పైపులైన్ లీకేజీలు ఉన్నాయన్నారు. ఆర్అండ్‌బీ అనుమతి తీసుకొని నీరు లీకేజీ కాకుండా చూస్తామన్నారు.

కోరుట్ల ఏడీఈగా భూమేశ్వర్

కోరుట్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల విద్యుత్ శాఖ టౌన్ ఏడీఈగా అడెపు భూమేశ్వర్‌ను సోమవారం ట్రాన్స్‌కో ఉన్నత అధికారులు ఉత్వర్వులు జారీ చేశారు. ప్రస్తుతం కథలాపూర్ మండలంలోని అంబారిపేట సబుస్టేషన్ పరిధిలో ఏఈగా పని చేస్తున్న భూమేశ్వర్‌కు ఏడీఈగా పదోన్నతి కల్పించి కోరుట్ల టౌన్ ఏడీఈగా ఉత్వర్వులు జారీ చేశారు.

చురుగ్గా ధాన్యం కొనుగోళ్లు

●మండలంలో 13 వేల ఎకరాల్లో వరి సాగు

●17 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు



హమాలీలు లారీలోకి లోడ్ చేస్తున్న ధాన్యం

ఇబ్రహీంపట్నం, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): మండలంలో వరి ధాన్యం కొనుగోళ్లు చురుగ్గా సాగుతున్నాయి. గత నెలలో వర్షాల నేపథ్యంలో వరికోతలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. వాతావ రణం అనుకూలించడంతో వరి కోతలు ఒక్కసారిగా ఊపందుకున్నాయి.

●**48 గంటల్లోనే సొమ్ము ఖాతాల్లో జమ**

ప్రతి రైతు వివరాలను ట్యాబ్‌లో నమోదు చేసి, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వరి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో సంబంధిత రైతులకు వారి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నారు. రైస్ మిల్లులకు వెళ్లిన ధాన్యం బస్తాలు ఆన్‌లోడింగ్‌లో సమస్యలు తెలిస్తే రెండు, మూడు రోజుల్లో ఆలస్యంగా ఖాతాలో జమ చేస్తున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎక్కువమంద కూలీలను తెప్పించి త్వరితగతిన కొనుగోలు జరిగేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. మండలంలోని 17 కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు 70వేల క్వింటాళ్ల వడ్లు కొనుగోలు జరిగాయి. తిమ్మాపూర్ సొసైటీ పరిధిలో 10,500 క్వింటాళ్లు, యామపూర్ పరిధిలో 10,600 క్వింటాళ్లు ఇబ్రహీంపట్నం పరిధిలో 15,300 క్వింటాళ్లు, డీసీఎంఎస్ ద్వారా 6350 క్వింటాళ్లు, ఎఫ్‌పీఓ ద్వారా 6834, ఐకేపీ ఆధ్వర్యంలో 15,680 క్వింటాళ్ల వరి ధాన్యం కొనుగోలు జరిగాయి.

రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

- వరప్రసాద్, తహసీల్దార్



కొనుగోలు కేంద్రాల్లో రైతు లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలు చేపడుతున్నాం. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలిస్తూ, రైతుల వివరాలను ట్యాబ్‌లో నమోదు చేస్తున్నాం.

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల అర్బన్, నవంబర్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజావాణి అని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. సోమవారం జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సుదూర ప్రాంతాల నుంచి వారి సమస్యల పరిష్కారాకి ప్రజావాణిని ఆశ్రయిస్తున్నారని, అలాంటి వారి సమస్యలు పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించాలి

-విజయలక్ష్మి, జగిత్యాల

మేము జగిత్యాల పట్టణంలో 20 సంవత్సరాలుగా అద్దెకు ఉంటున్నాం. డబుల్ బెడ్ రూం ఇంటి కోసం అనేక సార్లు వినతిపత్రం ఇచ్చాను. ఇటీవల వార్డు సమావేశంలో తమకు ఇళ్ళు మంజూరు అయినట్లు చెప్పారు. ఇప్పుడు రాలేదు అంటున్నారు. మాకు ఇల్లు కేటాయించాలి.

నాలుగేళ్లుగా పింఛను కోసం తిరుగుతున్నా

- గుర్రం గంగాధర్, జగిత్యాల

కరోనా సమయంలో కాలు నొప్పి ఉందని జగిత్యాల పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి వెళితే పక్షవాతం వచ్చిందని చికిత్స చేశారు. దాంతో ఇన్ఫెక్షన్ అయి నా కాలు తొలగించారు. అప్పటి నుంచి నాకు పింఛన్ ఇప్పించమని సదరం సర్టిఫికెట్ తీసుకుని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు.

జాతరను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి

గొల్లపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. సోమవారం గొల్లపల్లి మండలం మల్లన్న పేట శ్రీ మల్లిఖార్జున స్వామి జాతర ఉత్సవాలను పురస్కరించుకుని ఎస్పీ పోలీసు అధికారులతో కలిసి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అంతకుముందు ఎస్పీ శ్రీ మల్లిఖార్జున స్వామి ఆలయాన్ని దర్శించుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఫౌండరి ట్రస్ట్ కొండూరి శాంతయ్య లడ్డూ ప్రసాదాలు అందజేశారు. డీఎస్పీ రఘుచందర్, ఎస్సీ ఇన్‌స్పెక్టర్ ఆరిఫ్ అలీ ఖాన్, సీఐ రవి, ఎస్సై కృష్ణాసాగర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్, మాజీ ఎంపీటీసీ భీమ సత్తయ్య, ఆలయ ఈవో విక్రమ్ ఉన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం



చీరెలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కొడిమ్యాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం అన్నారు. సోమవారం మండల కేంద్రంలో చీరెలను పంపిణీ చేశారు. 32 మంది లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్‌లను అందించారు. 84 మందికి కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్‌లను పంపిణీ చేసారు. మండలంలోని కోనాపూర్ గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్‌కు శంఖుస్థాపన చేసారు. ఈ కార్యక్రమాల్లో ట్రాన్స్‌కో ఎస్ఈ సుద ర్శన్, మెట్‌పల్లి ఆర్డీవో, చొప్పదండి నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఎన్. శ్రీనివాస్, డీఈలు గంగారాం, గోపికృష్ణ, ఏడీఈ మహేందర్, ఏఈ రఘునాథ్, తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీవో స్వరూప, మల్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జీవన్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ రాజనర్సింగరావు, మార్కెట్ చైర్మన్ మహేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నారాయణగౌడ్ పాల్గొన్నారు.

●**మల్యాల:** మండల కేంద్రంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. అనంతరం కళ్యాణలక్ష్మి, ముఖ్యమంత్రి సహాయనిధిచెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వసంత, ఎంపీడీవో స్వాతి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మల్లీశ్వరీశ్రీనివాసగౌడ్, ఎంపీవో ఆమని పాల్గొన్నారు.

●**రాయికల్/బీర్‌పూర్/జగిత్యాల రూరల్:** రాయికల్ మండలంలోని అల్లీపూర్, ఆలూరు, వీరాపూర్ గ్రామాల్లో చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీవో చిరంజీవి ప్రారంభించారు. బీర్‌పూర్‌తో పాటు పలు గ్రామాలలో చీరల పంపిణీ నిర్వహించారు. కార్యక్రమంలో కెడిసీసీ జిల్లా మెంబరు ముప్పాల రాంచందర్‌రావ్ పాల్గొన్నారు. పెగడపల్లిలో చీరల పంపి ణీని ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ రావు, తహసీల్దార్ ఆనంద్ కుమార్‌లతో కలసి మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ రాములు గౌడ్ ప్రారంభించారు. జగిత్యాల మండలం ధరూర్, రూరల్ మండలం లోని అంతర్గాం, కన్నాపూర్, లక్ష్మీపూర్‌లో చీరలను జగిత్యాలఅర్బన్ ఎంపీడీఓ విజయలక్ష్మీ, జగిత్యాల రూరల్ ఎంపీడీఓ రమాదేవి పాల్గొన్నారు.

'స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి'



మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

జగిత్యాల టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ నాయకులకు పిలుపునిచ్చారు. జగిత్యాల జిల్లా కేంద్రలోని జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ధర్మపురి నియోజకవర్గ పార్టీ నాయకులకు మాజి మంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ గ్రామాల వారీగా పార్టీ పరిస్థితి, అభ్యర్థుల విజయానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఘనవిజయం సాధించాలంటే నాయకులంతా ఐక్యంగా పనిచేయాలని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించే బాధ్యత ప్రతి నాయకుడిపై ఉందన్నారు. ప్రజల్లో బీఆర్ఎస్‌పై ఇంకా నమ్మకం ఉందని, నాయకులు ఇప్పటి నుండే ప్రజల్లోకి వెళ్లి మమేకం కావాలన్నారు. విభిన్న అంశాలపై దృష్టి పెట్టి అధికార కాంగ్రెస్ హామీలను అమలు చేయడంలో విఫలమైన విషయాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. బిఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు వంటి అంశాలను ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు ఊరట

(ఐదో పేజీ తరువాయి)

అందిస్తున్నారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరల నేపథ్యంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు కొంతకాలంగా ఆందోళన చేప డుతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం నెలలోనే రెండుసార్లు ధరలు పెంచింది. దీంతో వారిలో హర్షం వ్యక్తమవుతోంది. ఈ పెంచిన ధరలు మే 1వ తేదీ నుంచి అమలు చేయనుంది. అయితే సెప్టెంబరు వర కు బడ్జెట్ విడుదల చేసినప్పటికీ పెండింగ్ బిల్లులను ఏరియర్స్ రూపంలో చెల్లించనున్నారు. అధిక వర్షాల తో కూరగాయలు, ఆకుకూరలు దెబ్బతిన్నాయి. దీంతో ధరలు ప్రస్తుతం మండిపోతున్నాయి. కోడి గుడ్డు ధర కూడా పెరగడంతో అదనపు భారం పడుతోంది.

మెనూ అమలు ఇలా..

ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మెనూ ప్రకారం వంట ఏజెన్సీ నిర్వాహకులు విద్యార్థులకు భోజనం అందించాల్సి ఉంది. సోమవారం అన్నం, కోడిగుడ్లు, వెజిటేబుల్ కర్రీ, మంగళవారం అన్నం పప్పు, ఆకుకూరలు, బుధవారం అన్నం, కోడుగుడ్లు, వెజిటేబుల్ కర్రీ, గురువారం అన్నం, సాంబర్, వెజిటెబుల్ కర్రీ, శుక్రవారం అన్నం కోడిగుడ్లు, వెజిటేబుల్ కర్రీ, శనివారం వెజిటేబుల్ బిర్యానీ అందిస్తారు. ఇలా వారానికి మూడుసార్లు భోజనంతో పాటు ఉడికించిన గుడ్డు అందించాల్సి ఉంటుంది. అయితే కొన్ని పాఠశాలల్లో పూర్తి స్థాయిలో మెనూ అమలు కావడం లేదని తెలుస్తోంది. ప్రస్తుతం ధరల పెంపు నేపథ్యంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించి వారి ఆరోగ్యంపై దృష్టిసారించాలని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

●**సకాలంలో బిల్లులు రాక..**

మధ్యాహ్న భోజనానికి సంబంధించి బిల్లులు సకాలంలో రావడం లేదని కార్మికులు ఆరోపిస్తున్నారు. అప్పులు తెచ్చి వంట చేస్తున్నామని బిల్లులు మాత్రం సకాలంలో ఇవ్వకపోతే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. పాఠశాలలో విద్యార్థులకు రోజూ కూరగాయలు తప్పనిసరి వండి పెట్టాలి. అయితే ప్రస్తుతం కూరగాయలు, పప్పు, చింతపండు, కారంతో పాటు వంటగ్యాస్ ధర విపరీతంగా పెరగడంతో ప్రభుత్వం చెల్లించే డబ్బులు సరిపోవడం లేదు. వారానికి మూడుసార్లు గుడ్డు పెట్టాల్సి రావడంతో ప్రస్తుతం మార్కెట్లో గుడ్డు ధర విపరీతంగా పెరిగి ఆర్థిక భారం పడుతోందని వారు వాపోతున్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

ఎండపల్లి, నవంబరు24(ఆంధ్రజ్యోతి): రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, తాము పండించిన పంటను నేరుగా కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకొని ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధర పొందాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని గుల్లకోట, ఎండపల్లి గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ ఎడ్ల అనిల్ కుమార్, అన్వేష్ పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

గొల్లపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ధాన్యం బస్తాలను దిగుమతి చేసుకోవడంలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత మిల్లర్లను హెచ్చరించారు. సోమవారం గొల్లపల్లి మండలం లొత్తునూర్ గ్రామంలోని ఘట్కేసర్ ఇండస్ట్రీస్ రైస్ మిల్లును ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీఎస్‌వో జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ భూములు అమ్ముతున్న ముఖ్యమంత్రి'

జగిత్యాల టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రియల్ ఎస్టేట్ బ్రోకర్‌లా ప్రభుత్వ భూములను అమ్మకానికి పెట్టాడని కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్‌కుమార్ ఆరోపించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ 14 వేల ఎకరాల్లో ఫార్మసిటీ పెడితే దాన్ని ఫ్యూచర్ సిటి అని చెప్పి రేవంత్‌రెడ్డి అమ్ముతున్నాడని అన్నారు. సమావేశంలో బిఆర్ ఎస్ నాయకులు చీటి వెంకట్‌రావు, మారు సాయిరెడ్డి, ఎల్లాల దశరథ్ రెడ్డి, చంద్రశేఖర్ రావు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల రిజర్వేషన్లు ఖరారు

వెల్గటూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 19 గ్రామ పంచాయతీలకు సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్లను ఖరారు చేశారు. బీరుసాని (బీసీ జనరల్), చెగ్యాం (ఎస్సీ మహిళ), జగదేవ్‌పేట (ఎస్సీ జనరల్), కప్పారావుపేట (జనరల్), కిషన్‌రావుపేట (జనరల్ మహిళ), కోటిలింగాల (జనరల్), కుమ్మరిపల్లి (జనరల్ మహిళ), ముక్కట్రావ్‌పేట (జనరల్), ముత్తునూర్ (ఎస్సీ మహిళ), పైడిపల్లి (బీసీ మహిళ), పాషిగామ (జనరల్ మహిళ), రాజక్కపల్లి (జనరల్), రాంనూర్ (ఎస్సీ జనరల్), సంకెనపల్లి (జనరల్ మహిళ), శాఖాపూర్ (జనరల్ మహిళ), స్తంభంపల్లి (ఎస్సీ జనరల్), తాళ్ల కొత్తపేట (బీసీ జనరల్), వెల్గటూర్ (బీసీ మహిళ), వెంకటాపూర్ (జనరల్) గా రిజర్వేషన్లు ఖరారు అయ్యాయి.

రాయికల్: రాయికల్ మండలంలో సర్పంచుల రిజర్వేషన్లు ఖరారయ్యాయి.

●ఎస్టీ మహిళ- ఆల్యానాయక్ తండా, కైరిగూడెం

●ఎస్టీ జనరల్- జగన్నాథ్‌పూర్, మంక్యా నాయక్ తండా, వస్తాపూర్

●ఎస్సీ మహిళ- బోర్నపెల్లి, మహితాపూర్

●ఎస్సీ జనరల్ ఇటిక్యాల, కుమ్మరిపెల్లి

●బీసీ జనరల్-ఆలూరు, కిష్టంపేట, రామాజీపేట, శ్రీరాంనగర్, తాట్లవాయి

●బీసీ మహిళ- అయోధ్య, భూపతిపూర్, కట్కాపూర్, ఒడ్డెలింగాపూర్.

●జనరల్ మహిళ-చింతలూరు, మూటపెల్లి, సింగర్రావుపేట, అల్లీపూర్, కొత్తపేట, ఉప్పుమడుగు, వీరాపూర్

●జనరల్-చెర్లకొండాపూర్, దావన్‌పెల్లి, ధర్మాజీపేట, కొత్తపేట, కుమ్మరిపెల్లి, ఒడ్డెర కాలనీ, రాజనగర్, రామారావుపల్లి

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లి టౌన్, నవంబరు24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో రాణించాలని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మెట్‌పల్లి పట్టణంలోని అంబేద్కర్ స్టేడియంలో జగిత్యాల అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న అథ్లెటిక్స్ పోటీలను కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ముఖ్యఅతిథిగా పాల్గొని జెండా ఊపి ఆటలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పోటీ నిర్వాహకులు, కోచ్‌లు, ఫిజికల్ డైరెక్టర్లను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎలేటి ముత్యంరెడ్డి, ఎంఈఓ చంద్రశేఖర్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చదరంగంతో సృజనాత్మకత పెంపు

కోరుట్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదరంగంతో సృజనాత్మకత పెంపొందుతుందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. సోమవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో విద్యార్థులకు చెస్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో చేస్ బోర్డు పంపిణీ నిర్వహించిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మాట్లాడారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి నరేశం, కాంప్లెక్ ప్రధానోపాధ్యాయులు గంగాధర్, అనందరావు, జోష్ణ, భూమయ్య పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడిగా నందయ్య ఎంపిక హర్షణీయం

జగిత్యాల అర్బన్, నవంబర్ 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా గాంజంగి నందయ్య ఎంపిక హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ బుగ్గారం మండల శాఖ అధ్యక్షులు వేముల సుభాష్ అన్నారు. సోమవారం జగిత్యాల పట్టణంలో నందయ్యను అభినందించిన ఆయన మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల కాలంగా నందయ్య కాంగ్రెస్ పార్టీలో ఉంటూ పార్టీకి ఎంతో సేవ చేశారని, అలాంటి బీసీ నాయకుడిని గుర్తించి జిల్లా పార్టీ అధ్యక్షులుగా ఎంపిక చేయడం పార్టీలో నూతనోత్సాహం నింపిందన్నారు.

వందేమాతర గీతం స్వాతంత్ర్య ఉద్యమానికి స్ఫూర్తినింపింది

కోరుట్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వందేమాతరం గీతం స్వాతంత్ర్య ఉద్యమానికి స్ఫూర్తిని అందించిందని వేములవాడ బీజేపీ నియోజకవర్గ ఇంచార్జి చెన్నమనేని వికాస్‌రావు అన్నారు. సోమవారం పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో 150 సంవత్సరాలు పూర్తి చేసున్న సందర్భంగా వందేమాతర గేయాపాలన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ బీజేపీ కౌన్సిలర్లు పెండం గణేష్, మ్యాడవేని నరేష్, బీజేపీ నాయకులు సుదవేణి మహేష్, చెట్లపల్లి సాగర్, ఎర్ర రాజేందర్, గుంటుకు సదాశివ్, దోనికెల నవీన్, నడిగే మహేష్ పాల్గొన్నారు.